సాగుకు సమాయత్తం..!



దుక్కి దున్నుతున్న రైతు

- 22,600 ఎకరాల్లో సాగు అంచనా
- వ్యవసాయ పనుల్లో బిజీగా రైతులు

తిర్యాణి: మండలంలో వానాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే రోహిణి కార్తె ప్రారంభమవగా దుక్కులు దున్నడం, సేంద్రియ ఎరువులు పొలాల్లో చల్లడం వంటి పనులు ఊపందుకున్నాయి. మండలంలో ఎక్కువగా వర్షాధారిత పంటలు సాగవుతుండగా రైతులు ఏ పంటలు సాగు చేస్తారు.. ఎంతమేర విత్తనాలు, ఎరువులు అవసరమవుతాయి.. తదితర అంశాలతో ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు సాగు ప్రణాళికలు సిద్ధం చేశారు.

సాగు అంచనా..

వర్షాకాలం పంటల సాగుకు సంబంధించి 22,600 ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉండనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతీ ఏడాది మాదిరి పత్తి అధికంగా 18,179 ఎకరాల్లో సాగు చేసే అవకాశాలుండగా, 1,623 ఎకరాల్లో వరి, 2,119 ఎకరాల్లో కందులు, 500 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కాగా ఈనెల 8న వచ్చే మృగశిర కార్తె తర్వాత వానలు కురుస్తాయని రైతులు భావిస్తున్నారు. దీంతో మండల వ్యాప్తంగా రైతులు వేసవి దుక్కులు దున్నుకొని సాగుకు సిద్ధంగా ఉంచుతున్నారు. వేసవిలో దుక్కులు దున్నడం వల్ల తొలకరి వర్షాలు పడగానే నీరు ఇంకి భూమి కోతకు గురి కాకుండా ఉంటుంది. లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి వెళ్లడం ద్వారా భూమి సారవంతంగా మారుతుంది. వేసవి దుక్కులు దున్నే ముందు పశువుల పెంట, కంపోస్టు ఎరువు, మట్టిని వెదజల్లడం ద్వారా భూమి సారవంతమై పంటల దిగుబడితో పాటు తేమశాతం పెరుగుతుంది. ఈ మేరకు రైతులు భూసారం పెరిగేలా వేసవి దుక్కుల పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. మరోవైపు విత్తనాలు, ఎరువుల కొనుగోలు కోసం ఫర్టిలైజర్ షాపుల్లో క్యూ కడుతున్నారు. కాగా విత్తనాల ఎంపిక, పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

వర్షాకాలం పంటల సాగుకు సంబంధించి క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వర్షాలు కురిసిన తరువాతే విత్తనాలు విత్తుకోవాలని రైతులకు సూచిస్తున్నాం. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో విత్తనాలు విత్తితే వేడికి మొలకెత్తే అవకాశం చాలా తక్కువగా ఉంటుంది.

– తిరుమలేశ్వర్, మండల వ్యవసాయశాఖ అధికారి

ఆశావర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



పెంచికల్‌పేట్: వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లాగౌడ్ తోటలో గల కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో సోమవారం ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఆశా వర్కర్లకు ఎగ్జామ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సీతారామ్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆశలకు రూ.18వేలు వేతనం అందించాలని, ఆశలకు ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన పరీక్షలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు లక్ష్మి, శ్రీలత, రాజేశ్వరి, శిరీష, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని ఆశా వర్కర్లు లోనవెల్లి పీహెచ్‌సీ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈమేరకు లోనవెల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు.

కాగజ్‌నగర్ మండలంలో..

ఆసిఫాబాద్: కాగజ్‌నగర్ మండలంలోని ఈజ్‌గాం పీహెచ్‌సీ ఎదుట సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు నిర్వహించే పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో డెప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు జ్యోతి, లక్ష్మి, సురేఖ, మాధవి, జల్పన, సుజాత, సురేఖ, స్వరూప, మీనా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

‘అనాథ చిన్నారులను ఆదుకుంటా’

కౌటాల: బాధిత అనాథ పిల్లలను అన్ని విధాలుగా ఆదుకుంటామని సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని ముత్తంపేట గ్రామంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథలైన ముగ్గురు పిల్లలను సోమవారం రాత్రి ఆయన పరామర్శించారు. వారికి రూ.25వేల నగదు ఆర్థిక సాయం అందించారు. పిల్లలను వసతి గృహాల్లో చేర్పిస్తామని, డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ ఆదే శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావ్, నాయకులు కొండయ్య, శంకర్, నాందేవ్, రవి, అంజయ్య తదితరులు ఉన్నారు.

ముగిసిన ఖవ్వాలీ కార్యక్రమం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ప్రారంభమైన ఖవ్వాలీ కార్యక్రమం సోమవారం ఉదయం ముగిసింది. నియోజకవర్గ ప్రజలు భారీగా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. కోనేరు ట్రస్టు ఆధ్వర్యంలో ప్రజలకు భోజన వసతి కల్పించారు. ఖవ్వాలీ కార్యక్రమాన్ని సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సతీమణి కోనేరు రమాదేవిలు, జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు, కోనేరు ట్రస్టు చైర్మన్ కోనేరు వంశీకృష్ణ, ప్రజాప్రతినిధులు, నాయకులు వీక్షించారు.

ఘనంగా బోనాల పండుగ

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి గ్రామంలో సోమవారం బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు లక్ష్మి అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో శివసత్తుల పూనకాలు, డప్పు వాయిద్యాలు, గురి గొడ్డు ఆటలతో కోలాహలంగా ఊరేగింపు నిర్వహించారు. బోనాల పండుగకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు భారీగా హాజరయ్యారు. పూజారి నాయిని భీమయ్య ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా గ్రామ పెద్దలు, గ్రామస్తులు బోనాల పండుగలో పాల్గొన్నారు.

‘మాలీలను మోసం చేసిన ఘనత కోనప్పది’

చింతలమానెపల్లి: ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మాలీ కులస్తులను అన్నివిధాలుగా మోసం చేసిన ఘనత ఎమ్మెల్యే కోనప్పకే దక్కిందని బీజేపీ నేత పాల్వాయి హరీశ్‌బాబు మండిపడ్డారు. చింతలమానెపల్లి మండలంలో సోమవారం పల్లెపల్లెకు పాల్వాయి–గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హేటిగూడ, రుద్రాపూర్, అడెపెల్లి, బాబాసాగర్ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాలీలను ఎస్టీ జాబితాలో చేర్పిస్తామని ప్రతీ ఎన్నికలో వాగ్దానం చేసి, హామీని నెరవేర్చడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. బీజేపీ మాలీలకు అండగా ఉంటుందని, వారి అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. నాయకులు మోర్లె బాబురావు, దుర్గం కారు, మోర్లె దయన్న, పెరుగు లక్ష్మణ్, మోర్లె సాయి, శ్రీమన్నారాయణ, పురుషోత్తం చారి, డుబ్బుల సంజీవ్, డుబ్బుల మురళి, రౌతు భాస్కర్, చందు యాదవ్ పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా ప్రారంభమైనట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో సోమవారం ఉదయం 39 మంది విద్యార్థులకు 28 మంది హాజరు కాగా, 11 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 15 మందికి 12 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను డీఈసీ బృందం సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు.

విధుల్లో చేరిన ఎస్‌వో

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా విద్యాశాఖ ఎస్‌వోగా ఉప్పులేటి శ్రీనివాస్ సోమవారం డీఈవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాస్ కౌటాల మండలంలోని కన్నెపల్లి పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పని చేస్తున్నారు. కార్యక్రమంలో ఎస్‌వోలు సత్తయ్య, భరత్, స్వర్ణలత ఉన్నారు.

గేదెను ఢీకొన్న బైక్

ఆసిఫాబాద్‌రూరల్: గేదెను బైక్ ఢీకొట్టడంతో ఇద్దరు గాయాలపాలైన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. అంబులెన్స్ ఈఎంటీ సతీశ్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్ నుంచి బైక్‌పై అప్పపల్లికి వెళ్తున్న క్రమంలో తెలంగాణ మోడల్ స్కూల్ వద్ద ఒక్కసారిగా గేదె అడ్డురావడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో అసిఫ్ హైమంద్, విసేష్‌లకు తీవ్రమైన గాయాలయ్యాయి. 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

కెరమెరి: ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని మండల వైద్యాధికారి వెంకటేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పోతెపల్లిలో శివాజీ విగ్రహావిష్కరణ



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సరిత

పెంచికల్‌పేట్: మండలంలోని పోతెపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని జెడ్పీటీసీ సముద్రాల సరిత –రాజన్న, ఆరె సంక్షేమ సంఘం నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో నడిచి వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అంతకుముందు గ్రామంలోని వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాసింగ్, ఎస్సై విజయ్‌కుమార్, సంఘం తాలుకా అధ్యక్షుడు చప్పిడే సత్యనారాయణ, సర్పంచ్‌లు సంజీవ్, సుధాకర్, శ్రీనివాస్, చంద్రమౌళి, పెంచికల్‌పేట్, దహెగాం మండల అధ్యక్షుడు డోకె మహేష్, తుమ్మిడే నారాయణ, సంఘం నాయకులు చౌదరి తిరుపతి, ఎల్కరి సుధాకర్, వెంకటాచలం, యూత్ సభ్యులు సురేందర్, శ్రీకాంత్, తిరుపతి, రాజ్‌కుమార్, శంకర్, మల్లేష్, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



కన్నెపెల్లి సెక్షన్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

తిర్యాణి: ప్రతీ ఒక్కరు పర్యావరణ సమతుల్యతకు పాటుపడాలని ఫారెస్టు రేంజ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కన్నెపెల్లి సెక్షన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మొక్కలు నాటడంతో పాటు లింగిగూడ గ్రామంలో అడవుల పెంపకం, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములై మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో కన్నెపెల్లి సెక్షన్ అధికారి మహేందర్, బీట్ ఆఫీసర్లు ఉన్నారు.

బెజ్జూర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని కాగజ్‌నగర్ డీఎల్‌పీవో సురేష్‌బాబు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి అత్యంత ప్రమాదకర ప్లాస్టిక్‌ను వాడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పర్యావరణ దినోత్సవం సందర్భంగా అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బెజ్జూర్ ఎంపీడీవో మాధవి, ఎంపీవో రమేశ్‌రెడ్డి, ఏపీఎం మోహన్‌లాల్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘భగీరథ’ లీకేజీలకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

వాంకిడి: మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామం నవేగాం(గడెమార్గ్) గ్రామపంచాయతీలో తాగునీటి సమస్యపై ‘సాక్షి’లో ఆదివారం ప్రచురితమైన ‘తాగు నీటి కోసం పడిగాపులు’ అనే కథనానికి అధికారులు స్పందించారు. మిషన్ భగీ రథ పైపు లీకేజీలకు మరమ్మతులు చేయించి గ్రా మంలో నీటి సరఫరా ప్రారంభించారు. నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ‘సాక్షి’కి కృతజ్ఞతలు తెలిపారు. ధోంద్రా, టోకిగూడ గ్రామాల్లోనూ సమస్య ఉందని, చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బాలు కోరుతున్నారు.



భగీరథ నల్లా నీరు పట్టుకుంటున్న గిరిజన మహిళ

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



బడిబాట కార్యక్రమంలో అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా సెక్టోరల్ అధికారి రాథోడ్ సుభాష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్‌లో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను బడిలో ప్రవేశం తీసుకునేలా పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోవింద్ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాంకిడి: మండలంలోని బెండార, చిన్న బెండార ప్రభుత్వ పాఠశాలల పరిధిలో బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటికి సర్వే నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు వివరించారు. సకల సౌకర్యాలతో ఉత్తమ విద్యాబోధన కల్పిస్తున్న ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్పించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు రవి, సీఆర్పీ దుర్గం సందీప్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ నాందేవ్, గ్రామస్తులు సోమ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: బడీడు పిల్లలను తల్లిదండ్రులు ప్రభు త్వ పాఠశాలల్లో చేర్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు అన్నారు. సోమవా రం మండలంలోని గుండాయిపేట గ్రామంలో జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాకేష్ గుప్త, విద్యార్థులు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: బడి బయట ఉన్న ప్రతీ విద్యార్థి బడిలో చేరాలని ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. మండలంలోని సాంగ్వి గ్రామంలో సోమవారం కొనసాగిన బడిబాటలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ నెల 17 వరకు వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. హెచ్‌ఎం జయరాం, టీచర్లు జాదవ్ రవీందర్, విజయ తదితరులు ఉన్నారు.

గుడ్డ సంచి వితరణ మిషన్ ప్రారంభం



క్లాత్ బ్యాగ్ వెండింగ్ మిషన్ ప్రారంభిస్తున్న కమిషనర్ అంజయ్య

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని అంబేద్కర్‌చౌక్‌లో సోమవారం సిర్పూర్ పేపర్ మిల్ సహకారంతో ఏర్పాటు చేసిన గుడ్డ సంచి వితరణ మిషన్ (క్లాత్ బ్యాగ్ వెండింగ్ మిషన్)ను మున్సిపల్ కమిషనర్ ఎస్.అంజయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో గుడ్డ సంచి మిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంబేద్కర్ చౌక్ సమీపంలో ఉన్న ఇంద్ర కూరగాయల మార్కెట్లో నిత్యం కూరగాయల కోసం వచ్చే ప్రజలు మిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ జయ చందర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న కార్యకర్తలు

వాంకిడి: మండలంలోని బెండార అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం కేర్‌ఇండియా సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. కేర్‌ఇండియా సీఆర్పీ పితాంబర్ మాట్లాడుతూ గర్భిణులు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేర్ ఇండియా కార్యకర్త దివ్య, అంగన్‌వాడీ కార్యకర్త ఉమ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని కోయగూడ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పలువురు గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జీజాబాయి, రమా, విజయ, అనిత, భూదేవి, సుజాత, విమల, తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కు అందజేత

సిర్పూర్(టి): మండలంలోని వేంపల్లి గ్రామంలోని మండోరె గణపతికి చెందిన ఆవు మూడు నెలల క్రితం పులిదాడిలో మృతి చెందింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి బాధిత రైతుకు రూ.20వేల పరిహారం మంజూరైంది. అటవీశాఖ అధికారులు, వైస్ ఎంపీపీ ఈర్ల సత్యనారాయణ, బీట్ అధికారి విజయ్‌యాదవ్ సోమవారం గ్రామానికి వెళ్లి గణపతికి పరిహారం చెక్కు అందజేశారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యేలు సక్కు, చిన్నయ్య



బతుకమ్మలు, బోనాలతో వస్తున్న సేవాసమితి సభ్యులు

అట్టహాసంగా సింగరేణి వేడుకలు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లో అట్టహాసంగా సింగరేణి వేడుకలు నిర్వహించారు. ముందుగా బతుకమ్మలు, బోనాలతో సింగరేణి ప్రగతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం భీమన్న స్టేడియంలో సింగరేణి ఉన్నతాధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, త్రివర్ణ బెలూన్లు ఆకాశంలోకి వదిలారు.

- రెబ్బెన



గోలేటిలో నిర్వహిస్తున్న సింగరేణి ప్రగతి ర్యాలీ



బతుకమ్మ ఆడుతున్న సేవాసమితి అధ్యక్షురాలు స్వరూపారాణి